సాక్షి కామారెడ్డి

మంగళవారం । 29 । జూలై । 2025



ఫిర్యాదులు పరిష్కరించాలి

ప్రజావాణిలో నమోదైన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు.

- 8లో ▸



ప్రతిపాదనలకే పరిమితమా?

కుక్కల సంఖ్య నియంత్రణకు ఉద్దేశించిన ఏబీసీ కేంద్రం ఏర్పాటు అంశం ఏడాదైనా ప్రతిపాదనల దశ దాటడం లేదు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.0 /22.0

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

నిజాంసాగర్‌లోకి 1,172 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టులోకి సోమవారం సాయంత్రం 1,172 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని అధికారులు తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఇన్‌ఫ్లో తగ్గిందని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా సోమవారం సాయంత్రానికి 1,391.22 అడుగుల (4.58 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని తెలిపారు.

నేడు మంత్రి సీతక్క రాక

దోమకొండ: జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క మంగళవారం దోమకొండకు రానున్నారు. ఉదయం 10 గంటలకు స్థానిక పెద్దమ్మ దేవాలయంలో జరిగే కార్యక్రమంలో ఆమె పాల్గొంటారని అధికారులు తెలిపారు. దోమకొండ, బీబీపేట మండలాలకు నూతనంగా మంజూరైన రేషన్‌కార్డులను పంపిణీ చేస్తారన్నారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కూడా ఈ పర్యటనలో పాల్గొంటారని ముందుగా ప్రకటించినా.. ఆయన పర్యటన రద్దయ్యిందని పేర్కొన్నారు. మంత్రి పర్యటన నేపథ్యంలో తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్‌తో పాటు భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్ భద్రత ఏర్పాట్లు పరిశీలించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకులు ప్రజలను కోరారు.

నేడు రైతులతో శాస్త్రవేత్తల ముఖాముఖి

కామారెడ్డి అర్బన్: రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం రైతులతో శాస్త్రవేత్తల ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. వానకాలం పంటల్లో యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజమాన్యం, పురుగులు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై శాస్త్రవేత్తలు సూచనలిస్తారని పేర్కొన్నారు. ఇస్రోజీవాడి, క్యాసంపల్లి, చిన్నమల్లారెడ్డి రైతు వేదికల్లో నిర్వహించే కార్యక్రమాలలో రైతులు పాల్గొనాలని కోరారు.

రేపు జాబ్‌మేళా

కామారెడ్డి అర్బన్: కలెక్టరేట్‌లో బుధవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలో నిజామాబాద్ ఏజెన్సీ మేనేజర్ పోస్టుల భర్తీ కోసం ఈ జాబ్‌మేళా ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన 21 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు 95057 82222, 76719 74009 నంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

ఒకటిన జిల్లా స్థాయి సీనియర్ యోగా ఎంపిక పోటీలు

కామారెడ్డి అర్బన్: కలెక్టరేట్ సమీపంలోని జిల్లా యోగా భవన్‌లో ఒకటో తేదీన యోగా సీనియర్ ఏ, బీ, సీ కేటగిరీల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 55 ఏళ్లలోపువారు పాల్గొనాలని సూచించారు. ఈ పోటీలలో ప్రతిభ చూపినవారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని, వారు ఆగస్టు 7, 8 తేదీల్లో ఆదిలాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 94400 37948 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఎక్కేందుకు పోటీ పడుతున్న ప్రయాణికులు

'మహాలక్ష్మి'కి ఆర్టీసీ తూట్లు!

మహాలక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. దీంతో బస్సుల్లో ప్రయాణించేవారి సంఖ్య పెరిగింది. అయితే రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులను పెంచాల్సిందిపోయి.. ఉన్న బస్సులను తగ్గించారు. ప్రధానంగా రాజధానికి ఎక్స్‌ప్రెస్ బస్సులను తగ్గించడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. – సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

- హైదరాబాద్ రూట్‌లో డీలక్స్ బస్సులే ఎక్కువ
- కామారెడ్డి డిపో నుంచి ఎక్స్‌ప్రెస్‌లు తొమ్మిదే..
- ఇబ్బందిపడుతున్న మహిళా ప్రయాణికులు
- ఇతర డిపోల నుంచి వచ్చే బస్సులే దిక్కు



కామారెడ్డి బస్టాండ్ ఆవరణలో ఉన్న హైదరాబాద్ వెళ్లే డీలక్స్ బస్సులు

ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకానికి ఆర్టీసీ అధికారులు తూట్లు పొడుస్తున్నారు. ఈ పథకం వర్తించే ఎక్స్‌ప్రెస్ బస్సులను తగ్గించి, ఆదాయం కోసం డీలక్స్ బస్సు సర్వీసులను నడుపుతున్నారు. ప్రధానంగా హైదరాబాద్ రూట్‌లో ఎక్స్‌ప్రెస్ బస్సులను తగ్గించారు. కామారెడ్డి బస్ స్టేషన్ నుంచి రాష్ట్ర రాజధానికి నిత్యం వేలాది మంది ప్రయాణిస్తారు. ఇదే రూట్‌లో చేగుంట, తూప్రాన్, మేడ్చల్ తదితర ప్రాంతాలకు వెళ్లే వారూ ఎక్కువగానే ఉంటారు. అయితే ఎక్స్‌ప్రెస్ బస్సులు తక్కువగా ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. కామారెడ్డి డిపో నుంచి హైదరాబాద్ రూట్‌లో రోజూ 45 ట్రిప్పులు నాన్ స్టాప్ (డీలక్స్) బస్సులు, అలాగే నాలుగు సూపర్ లగ్జరీ బస్సులు నడుస్తున్నాయి. వీటిలో ఉచిత ప్రయాణానికి అనుమతి లేదు. అవి నేరుగా సికింద్రాబాద్ (జూబ్లీ బస్‌స్టేషన్)కు వెళతాయి. ఎక్స్‌ప్రెస్ బస్సులు భిక్కనూరు, రామాయంపేట, చేగుంట, తూప్రాన్, మేడ్చల్ మీదుగా జూబ్లీ బస్‌స్టేషన్‌కు నడుస్తాయి. కామారెడ్డి బస్‌స్టేషన్ నుంచి ఉదయం 4.30 గంటలకు ఒక ఎక్స్‌ప్రెస్, తర్వాత 7.30 గంటలకు ఒకటి, 9 గంటలు, 9.20 గంటలు, 9.30 గంటలు, 9.40 గంటలు, 10 గంటలు, 10.20 గంటలకు, మధ్యాహ్నం 1.30 గంటలకు ఒక ఎక్స్‌ప్రెస్ బస్సు చొప్పున నడుస్తున్నాయి. ఎక్స్‌ప్రెస్ బస్సులు తక్కువగా ఉండడంతో ఆ బస్సుల్లో విపరీతమైన రద్దీ ఉంటోంది. మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత ఎక్స్‌ప్రెస్ లేకపోవడంతో హైదరాబాద్ రూట్‌లో వెళ్లడానికి ప్రయాణికులు అవస్థలు పడాల్సి వస్తోంది. హైదరాబాద్‌లోని ఆస్పత్రులకు వెళ్లేవారు, పిల్లల చదువుల విషయంలో వెళ్లేవారు, అలాగే బంధువుల వద్దకు వెళ్లేవారంతా ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో సీట్లు దొరక్క పడుతున్న ఇబ్బందులు అంతా ఇంతా కాదు. హైదరాబాద్‌లో చదువుకునే విద్యార్థినులు సెలవుల సమయంలో సొంతూళ్లకు రావడానికి, తిరిగి హైదరాబాద్‌కు వెళ్లడానికి నరకం చూస్తున్నారు.

సీట్లు దొరక్క నిలబడే ప్రయాణం..

కామారెడ్డి మీదుగా రాష్ట్ర రాజధానికి నిర్మల్, భైంసా, ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ తదితర డిపోలకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులు కొన్ని వస్తుంటాయి. అయితే అక్కడి నుంచే నిండుగా ప్రయాణికులతో వస్తాయి. దీంతో కామారెడ్డినుంచి ప్రయాణం చేసే వారు సీట్లు దొరక నిలబడి ప్రయాణించాల్సి వస్తోంది. భిక్కనూరు, రామాయంపేట వరకు వెళ్లేవారు ఆర్డినరీ బస్సుల్లో వెళుతుండగా.. చేగుంట, తూప్రాన్ ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు, అలాగే జేబీఎస్‌కు వెళ్లాల్సిన వారు ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో నిలబడి వెళ్లాల్సి వస్తోంది. ఎక్స్‌ప్రెస్ బస్సులు తగ్గించి డీలక్స్ బస్సులను పెంచడంతోనే ఈ సమస్య వచ్చిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డీలక్స్ బస్సులో కామారెడ్డి నుంచి హైదరాబాద్‌కు టికెట్ రేటు రూ. 230 ఉంది. దీంతో చాలామంది మహిళలు ఆ బస్సులో ప్రయాణించడానికి ఆసక్తి చూపడం లేదు. ఎక్స్‌ప్రెస్ బస్సులలో నిలబడే ప్రయాణిస్తున్నారు. ఎక్స్‌ప్రెస్‌ల పరిస్థితి ఇలా ఉండగా.. డీలక్స్ బస్సులు ఎక్కువగా ఉండడంతో ఒక బస్సు నిండేంత వరకు మరో మూడు నాలుగు బస్టాండ్ ఆవరణలో వేచి ఉంటున్నాయి.

పట్టించుకోని నేతలు..

కామారెడ్డి ఆర్టీసీ డిపో నుంచి రాష్ట్ర రాజధాని హైదరాబాద్ వైపు ఎక్స్‌ప్రెస్‌లు అరకొరగా నడుస్తుండడంతో మహిళా ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజారవాణాపై దృష్టి సారించడం లేదు. ప్రయాణ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రజాప్రతినిధులు స్పందించి ఎక్స్‌ప్రెస్ బస్సులు ఎక్కువ సంఖ్యలో నడిచేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఏటీసీతో మెరుగైన ఉపాధి అవకాశాలు

- విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. జిల్లాలోని ఏటీసీ కేంద్రాల్లో వివిధ కోర్సుల్లో రెండో దశ ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ప్రవేశాలను ప్రోత్సహించేందుకు రూపొందించిన వాల్‌పోస్టర్లను సోమవారం కలెక్టర్ తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీ-గేట్ పథకంలో భాగంగా యువతలో సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరిచి ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లను ఏర్పాటు చేసిందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)లుగా మారుస్తోందన్నారు. ఈ కేంద్రాల్లో ఆధునిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు శిక్షణ లభిస్తుందన్నారు. ఏటీసీ ప్రాంగణ నియామకాల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జిల్లాలో బిచ్కుంద, ఎల్లారెడ్డి, తాడ్వాయిలలో ఏటీసీ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

వాటిలో రెండో దశ ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. మాన్యుఫాక్చరింగ్‌ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్ మాన్యుఫాక్చరింగ్, ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫయర్ (మెకానికల్), అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నిషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్, ఎలక్ట్రీషియన్‌లాంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తిగల యువకులు తమకు నచ్చిన విభాగాల్లో శిక్షణ కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీ-గేట్ కమిటీ జిల్లా కన్వీనర్ ప్రమోద్‌కుమార్, సహాయ కార్మిక కమిషనర్ కోటేశ్వర్లు, పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



ఆరోగ్య కేంద్రంలో వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

- నిరంతరం అందుబాటులో ఉండాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

మాచారెడ్డి : విధులలో వైద్య సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ హెచ్చరించారు. సోమవారం పాల్వంచ మండల కేంద్రంలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంతో పాటు ఆరోగ్య ఉపకేంద్రాన్ని తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. వైద్య సిబ్బంది పనితీరును తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నందున వైద్యులు, సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, వైద్యాధికారులు ప్రభుకిరణ్, ఆదర్శ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఇళ్ల నిర్మాణంలో వేగం పెరగాలి

పాల్వంచ మండల కేంద్రంలో పర్యటించిన కలెక్టర్.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఇంటి నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. పాల్వంచలో 34 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా 23 నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. వాటిని వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట మండల ప్రత్యేకాధికారి శ్రీపతి, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ హిమబిందు తదితరులున్నారు.

నిరాశాజనకంగా కౌలాస్ ప్రాజెక్టు



కౌలాస్ ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీరు

- ఆందోళనలో ఆయకట్టు రైతులు

నిజాంసాగర్ : వర్షాకాలం ప్రారంభమై నెలన్నర గడిచినా కౌలాస్ ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరలేదు. దీంతో ఆయకట్టు రైతులు నిరాశలో ఉన్నారు.

జుక్కల్ మండలంలోని కౌలాస్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 458 మీటర్లు(1.237 టీఎంసీలు) కాగా.. ఆదివారం సాయంత్రానికి 455 మీటర్ల (0.6 టీఎంసీ) నీరు నిల్వ ఉంది. ఎగువన ఉన్న కర్ణాటక, మహారాష్ట్రలలో భారీ వర్షాలు లేకపోవడంతో కౌలాస్‌లోకి ఇన్‌ఫ్లోలు రావడం లేదు. ఎగువన ఉన్న ఏడూర్ ప్రాజెక్టు నిండితే తప్ప ఈ ప్రాజెక్టులోకి నీరు చేరే అవకాశాలు లేవు. ప్రస్తుతం ఏడూర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు తక్కువగా ఉండడంతో కౌలాస్ ప్రాజెక్టు ఇప్పట్లో నిండడం కష్టమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సాగుకు నోచుకోని భూములు..

జుక్కల్ మండలంలోని కౌలాస్ ప్రాజెక్టు కింద 9 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. కుడి, ఎడమ కాలువ కింద వానాకాలం పంటల సాగు కోసం రైతులు నారుమడులు సిద్ధం చేసుకున్నారు. అయితే ప్రాజెక్టులో నీరు అంతంత మాత్రంగానే ఉండడంతో నీటిని విడుదల చేయలేకపోతున్నారు. బోరుబావుల ఆధారంగా పలువురు రైతులు పంటలు సాగు చేస్తున్నారు. ప్రాజెక్టు నీటి ఆధారంగా పంటలు సాగు చేసేవారు నీటి విడుదల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయని కౌలాస్ ప్రాజెక్టు ఏఈ రవి శంకర్ తెలిపారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరితేనే ఆయకట్టుకు సాగు నీటిని విడుదల చేస్తామన్నారు.

చదవాలంటే.. నడవాల్సిందే!

- రవాణా సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



సిర్పూర్ నుంచి పెద్ద టాక్లీకి నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు



మద్నూర్ నుంచి తడిహిప్పర్గకు ప్రమాదకరంగా ఆటోలో వెళ్తున్న విద్యార్థులు

మద్నూర్: గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలు చదువుకునేందుకు పాట్లు పడుతున్నారు. భుజాన కిలోలకొద్దీ బరువున్న బ్యాగును వేసుకొని నిత్యం కిలోమీటర్ల కొద్దీ నడవాల్సి వస్తోంది. సరైన రవాణా సౌకర్యంలేక ఉమ్మడి మద్నూర్ మండలంలోని పలు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదివే సుమారు 300 మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

సకాలంలో నడవని బస్సులు..

మద్నూర్, డోంగ్లీ మండలాల పరిధిలోని మొగా, మదన్‌హిప్పర్గా, ఎన్‌బుర, ఇలేగావ్, పెద్ద ఎక్లార, కొడిచిర, రుసేగావ్, మారెపల్లి, పెద్ద శక్కర్గా తదితర గ్రామాలకు ఆర్టీసీ బస్సులు వెళ్లవు. దీంతో వారు ఆటోల్లో లేదా కాలినడకన పాఠశాలకు వెళ్లాల్సి వస్తోంది. సరైన సమయానికి బస్సులు రాకపోవడంతో సకాలంలో బడికి చేరుకోలేక బస్సు సౌకర్యం ఉన్న గ్రామాల విద్యార్థులూ ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లుగా విద్యార్థులు ఇబ్బంది పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

నడవలేకపోతున్నాం



మా గ్రామం నుంచి సిర్పూర్ మధ్య మూడు కిలోమీటర్ల దూరం ఉంటుంది. బస్సు సౌకర్యం లేకపోవడంతో బడికి రోజూ నడిచి వెళ్తున్నాం. రోజూ బ్యాగును మోస్తూ ఆరు కిలోమీటర్లు నడవాలంటే ఇబ్బందిగా ఉంది. సైకిళ్లు పంపిణీ చేయాలి.

– అంజలి, విద్యార్థి, పెద్ద టాక్లీ

8 గంటలకే బయల్దేరుతాం..



సిర్పూర్ స్కూల్‌లో చదువుతున్నాను. పాఠశాలకు సమయానికి చేరుకోవాలంటే ఇంటినుంచి గంట ముందే బయలుదేరాల్సి ఉంటుంది. లేకపోతే ఆలస్యం అవుతుంది. రోజూ ఆరు కిలోమీటర్లు నడవాలంటే చాలా కష్టంగా ఉంటోంది.

– ఆదిత్య, విద్యార్థి, పెద్ద టాక్లీ

అక్కను కాపాడబోయి చెల్లి

- బట్టలు ఉతకడానికి వెళ్లి నీటికుంటలో పడి ఇద్దరూ మృతి
- దోమకొండలో ఘటన





శివాని, మల్లవ్వ మృతదేహాలు

దోమకొండ: బట్టలు ఉతుకుతూ నీటిలో జారిపడిన అక్కతోపాటు కాపాడేందుకు ప్రయత్నం చేసిన చెల్లెలు నీటి కుంటలో పడి మృతిచెందిన ఘటన కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామ శివారులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద గోసంగికి చెందిన పలువురు కుటుంబాలు గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారు. రోజు మాదిరిగానే ఆదివారం సాయంత్రం గంగారపు మల్లేశం కూతుళ్లు పెద్దరాగుల శివాని(23), చిన్నరాగుల మల్లవ్వ (19) బట్టలు ఉతకడానికి నరసింగరాయకుంటకు వెళ్లారు. బట్టలు ఉతికే క్రమంలో అక్క శివాని నీటిలో జారిపడగా, అక్కను కాపాడే ప్రయత్నంలో చెల్లెలు మల్లవ్వ కూడా నీటిలోకి దిగింది. కాగా, ఇరువురు నీటి మునిగారు. స్థానికంగా వ్యవసాయ పనులు చేసి ఇంటికి వెళ్తున్న ఓ వ్యక్తి గమనించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. తండ్రి మల్లేశంతోపాటు శివాని భర్త దుర్గయ్య, మల్లవ్వ భర్త రమేశ్ కుంట వద్దకు చేరుకొని ఇరువురి కోసం వెతికారు. ఆదివారం రాత్రి మల్లవ్వ మృతదేహం, సోమవారం శివాని మృతదేహం లభించిందని పోలీసులు తెలిపారు.

గుంతే ప్రాణం తీసిందా...

అక్కాచెల్లెళ్లు బట్టలు ఉతుకుతున్న ప్రదేశంలో నీటి గుంత ఉంది. నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కుంటలోకి నీరు చేరింది. గుంతను గమనించని వారు బట్టలు ఉతికే క్రమంలో నీటిలోకి దిగడంతో ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఘటనా ప్రదేశం వద్ద పోలీసులు కట్టెలతో నీటి లోతును పరిశీలించారు. మొదట శివాని నీటిలో పడడంతో, ఆమెను పట్టుకుందామనే ప్రయత్నంలో మల్లవ్వ కూడా నీటిలో మునిగి చనిపోయినట్లు ఎస్సై స్రవంతి తెలిపారు. తండ్రి గంగారపు మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఆమె వివరించారు.

ఇనాం భూములకు పట్టాలివ్వాలి

- తాడ్వాయిలో రైతుల రాస్తారోకో

తాడ్వాయి: పూర్వీకుల నుంచి వస్తున్న ఇనాం భూములను తమ పేర్లపైకి మార్చి పట్టాలు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో సోమవారం తాడ్వాయి ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. రైతులకు బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈ విషయమై పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదన్నారు. ఈనెల 23న తాడ్వాయి తహసీల్ కార్యాలయంలో వినతి పత్రాన్ని ఇవ్వడమే కాకుండా కార్యాలయం ఎదుట నిరసన తెలిపామన్నారు. 372, 373, 374, 33 సర్వే నంబర్లలోని 40 ఎకరాల ఇనాం భూములు యాభై ఏళ్లుగా తమ కబ్జాలో ఉన్నాయన్నారు. ఇందులో 20 ఎకరాలు పట్టాలుగా మారాయని, మిగిలిన భూమిని కూడా మార్చాలని కోరారు. ఎస్సై మురళి సంఘటన స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. విషయాన్ని తహసీల్దార్ శ్వేత దృష్టికి తీసుకువెళ్లగా.. ఆమె వచ్చి రైతులతో చర్చించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.



రాస్తారోకో చేస్తున్న రైతులు

క్లుప్తంగా

'మున్నూరుకాపు సంఘాభివృద్ధి పనులు చేయిస్తా'



కామారెడ్డి అర్బన్: దేవునిపల్లి మున్నూరుకాపు సంఘాభివృద్ధికి అవసరమైన రూ.6 లక్షల విలువైన పనులు చేయిస్తానని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి హామీ ఇవ్వడంపై సంఘం నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. సోమవారం ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. సంఘం ప్రతినిధులు ద్యావరి నరేష్, కాసర్ల రవీందర్, ఎంపల్లి సుధాకర్, కాసర్ల రాజయ్య, నీలం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డు మంజూరు పత్రాల పంపిణీ



బిచ్కుంద(జుక్కల్): కొత్తగా రేషన్ కార్డు మంజూరైన లబ్ధిదారులకు సోమవారం బిచ్కుందలో కాంగ్రెస్ నాయకులు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖయ్యూం, నేతలు మల్లికార్జునప్ప షెట్కార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగాధర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

తాళాలు వేసిన మూడు ఇళ్లలో చోరీ

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీలో మూడు ఇళ్లలో ఆదివారం అర్ధరాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. మద్నూర్‌కు చెందిన లైబ్రేరియన్ కపిల్ కుటుంబసభ్యులు కామారెడ్డికి వెళ్లడంతో ఇంటికి తాళం వేశారు. దుండగులు తాళాలను పగులగొట్టి ఇంట్లో దాచిపెట్టిన రూ. 40 వేల నగదు అపహరించుకు వెళ్లారు. సోమవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు కపిల్ తెలిపారు. కాలనీలోని మరో రెండు ఇళ్ల తాళాలను దుండగులు పగులగొట్టారని స్థానికులు తెలిపారు. కాగా, నలుగురు వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు సీసీ కెమెరాలో రికార్డు అయ్యిందని పేర్కొన్నారు.

నేడు సినారె కవి సమ్మేళనం

కామారెడ్డి అర్బన్: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో సినారె జయంతి సందర్భంగా మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు స్థానిక కర్షక్ బీఎడ్ కళాశాలలో కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెరవే జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గఫూర్ శిక్షక్, అల్లి మోహన్‌రాజ్‌లు తెలిపారు. కవి సమ్మేళనం విజయవంతం చేయాలని కోరారు.

ఆవుల తరలింపు.. ఇద్దరిపై కేసు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): అనుమతి లేకుండా ఆవులను తరలిస్తున్న మండలంలోని పెద్ద ఆత్మకూర్ గ్రామానికి చెందిన ఫిరోజ్, షేక్ అలీమోద్దీన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై భార్గవ్‌గౌడ్ తెలిపారు. సోమవారం తెల్లవారుజామున మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద తమ సిబ్బంది వాహనాల తనిఖీలో భాగంగా ఆరు ఆవులను తరలిస్తున్న మినీ ట్రక్కును ఆపే ప్రయత్నం చేశారన్నారు. వాహనాన్ని ఆపకుండా వేగంగా తీసుకెళ్లడంతో సిబ్బంది వెంబడించి మండలంలోని రాఘవపల్లి సమీపంలో పట్టుకున్నట్లు తెలిపారు. ఆవులను తరలిస్తున్న ఇరువురిపై కేసు నమోదు చేశామని, పట్టుబడిన ఆవులను మెదక్ జిల్లా మంబోజిపల్లి సమీపంలోని గోశాలకు తరలించామన్నారు.

ప్రతిపాదనలకే పరిమితమా..?

- మంజూరు కాని యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్
- గోపన్‌పల్లిలో స్థలం పరిశీలన
- రికార్డులకే పరిమితమైన నివేదిక
- గుంపులుగా దాడి చేసి గాయపరుస్తున్న కుక్కలు



కుక్కల దాడిలో గాయపడ్డ చిన్నారి(ఫైల్)



బిచ్కుందలో గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు

బిచ్కుంద(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గంలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందని అధికారులు గుర్తించారు. కుక్కల పెరుగుదల నియంత్రించడానికి చర్యలు చేపట్టాలనే మంచి ఉద్దేశంతో బిచ్కుందలోని గోపన్‌పల్లి శివారులో ఏబీసీ(యానిమల్ బర్త్ కంట్రోల్) సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సెంటర్ కోసం ప్రభుత్వ స్థలం కావాలని గతేడాది గోపన్‌పల్లిలో జిల్లా పంచాయతీ అధికారి, రెవెన్యూ ఇతర శాఖల అధికారులు స్థలం పరిశీలించి అనుకూలంగా ఉందని గుర్తించారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు తయారు చేసి నివేదిక పంపారు. నేటికి ఏడాదవుతున్నా సెంటర్ ఇంకా మంజూరు కాలేదు. వీటి నిర్వహణ మున్సిపాలిటీ లేదా గ్రామ పంచాయతీ నిర్వహించాల్సి ఉంటుంది. జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో పంపించిన నివేదికలు రికార్డులకే పరిమితమయ్యాయి.

సెంటర్‌లో జనన నియంత్రణ ప్రక్రియ...

కుక్కలను చంపకుండా వాటి సంతానోత్పత్తి నియంత్రణకు ఏబీసీ సెంటర్‌లో శాశ్వతంగా బీజం పునరుత్పత్తి జరగకుండా చికిత్స చేస్తారు. ఈ సెంటర్‌లో వెటర్నరీ వైద్యులు, వైద్య సహాయ సిబ్బంది ఉంటారు. ప్రైవేటు ఏజెన్సీల ద్వారా ఆయా మండలాల నుంచి పట్టుకొచ్చిన కుక్కలకు స్టెరిలైజేషన్ చేసి కనీసం 3 రోజులు సెంటర్‌లో ఉంచి పర్యవేక్షణ చేస్తారు. అనంతరం తీసుకొచ్చిన ప్రదేశంలో తిరిగి కుక్కను వదిలేస్తారు. ఈ జనన నియంత్రణతో కుక్కల సంతతి పెరగకుండా ఉంటుందని వెటర్నరీ వైద్యులు సూచిస్తున్నారు. సెంటర్‌లో ఉన్నన్ని రోజులు కుక్కలకు ఆహారం పెడతారు.

గుంపులుగా వచ్చి దాడులు...

కుక్కలు గుంపులు గుంపులుగా వచ్చి అన్ని ఒకేసారి దాడి చేసి గాయపరుస్తున్నాయి. బిచ్కుంద, మద్నూర్‌లో వారం రోజుల క్రితం కుక్కలు దాడి చేసి పలువురిని గాయపరిచాయి. బిచ్కుందలో ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్న పిల్లలపై కుక్కలు దాడి చేశాయి. ఏ వీధిలో చూసినా కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయి. రాత్రి సమయంలో బయటకు వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారు. కుక్క కాటుతో రేబీస్ సోకుతుందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల బెడదనుంచి రక్షించాలని కోరుతున్నారు.

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణికి 124 వినతులు



ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 124 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో భూ సమస్యలు, పింఛన్‌లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులకు సంబంధించినవి ఎక్కువగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్, ఆర్డీవో వీణ, కలెక్టరేట్ పాలనాధికారి మసూర్ అహ్మద్, తదితరులున్నారు.

మత్స్య సొసైటీల ఖాతాల్లోనే డబ్బులు జమ చేయాలి..



ఆందోళన చేస్తున్న తెలంగాణ కార్మిక సంఘం నాయకులు, మత్స్యకారులు

చేప పిల్లలు, రొయ్యలు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం మత్స్య సొసైటీల ఖాతాల్లోనే డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మత్స్యకారులు, కార్మిక సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చారు. ధర్నాచౌక్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెరువులు, కుంటలు కబ్జాలు, కాలుష్యం బారి నుంచి కాపాడాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు ప్రతి మండల కేంద్రంలో చేపల మార్కెట్‌లను నిర్మించాలన్నారు. అర్హులైన ప్రతి సొసైటీ సభ్యుడికి బైక్, టాటా ఏస్, డీసీఎం వాహనాలను 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలన్నారు. చేపల వేట నిషేధ కాలంలో ప్రతి మత్స్యకారుడి కుటుంబానికి రూ.20 వేలు భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.

చట్టవ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న కళాబృందం ఇన్‌చార్జి తిరుపతి

బాన్సువాడ రూరల్: విద్యార్థులు, ప్రజలు చట్టవ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని పోలీస్ కళాబృందం ఇన్‌చార్జి తిరుపతి, శేషారావులు అన్నారు. సోమవారం వారు బాన్సువాడ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో పాటు ఆర్టీసీ బస్టాండ్‌లో వేర్వేరుగా ఆటపాటల ద్వారా అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలన్నారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోషల్‌మీడియాను మితంగా వినియోగించాలన్నారు. లైంగిక వేధింపులకు గురైతే భరోసా టోల్‌ఫ్రీ నెంబర్ 1098కు ఫిర్యాదు చేయాలన్నారు. ఎవరికి ఏకష్టం వచ్చినా, ఆపద వచ్చినా , చట్టవ్యతిరేక కార్యక్రమాలు చోటుచేసుకున్నా 100కి ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ప్రధానోపాధ్యాయురాలు సంతోషి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరింత ఉత్సాహంగా పని చేయాలి

- ఎస్పీ రాజేష్ చంద్ర



పదోన్నతి చిహ్నాన్ని అలంకరిస్తున్న ఎస్పీ

కామారెడ్డి క్రైం: పదోన్నతి పొందిన అధికారులు మరింత ఉత్సాహంగా పని చేయాలని ఎస్పీ రాజేష్ చంద్ర సూచించారు. జిల్లా పోలీస్ శాఖలో ఏఎస్సైగా పని చేస్తూ ఎస్సైగా పదోన్నతి పొందిన నరేందర్ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. నరేందర్‌కు ఎస్పీ పదోన్నతి చిహ్నాన్ని అలంకరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. పదోన్నతి ద్వారా పోలీసులకు గుర్తింపు లభిస్తుందన్నారు. పదోన్నతి పొందిన అధికారులు మరింత ఉత్సాహంగా, బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు.

గుంజిళ్ల మాస్టారుకు 'ఆయుష్ ఉదయ్ సమ్మాన్' అవార్డు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): డిచ్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మాజీ ప్రిన్సిపల్, గుంజిళ్ల మాస్టారుగా పేరొందిన అందె జీవన్‌రావు 'ఆయుష్ ఉదయ్ సమ్మాన్' అవార్డు అందుకున్నారు. ఆదివారం దక్షిణ గోవాలోని ఐటీసీ ఫార్చ్యూన్ రిసార్ట్‌లో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఆయుష్ కాంక్లేవ్ సదస్సులో అందె జీవన్ రావుకు గోవా కార్టోరిమ్ నియోజకవర్గ ఎమ్మెల్యే, గోవా పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అలెక్సో రెజినాల్డో లారెంకో అవార్డు అందజేశారు. ఈ సదస్సులో అందె జీవన్ రావు 'సూపర్ బ్రెయిన్ యోగా– ఎన్ అప్రొప్రియేట్ యోగిక్ ఎక్సర్ సైజ్ ఫర్ సుపీరియర్ ఇంటెలెక్ట్ అండ్ వెల్ బీయింగ్' అనే అంశంపై తన పరిశోధనా పత్రాన్ని సమర్పించి ప్రసంగించారు.

క్రైం కార్నర్

బస్సు ఢీకొని ఒకరి మృతి



నారాయణ (ఫైల్)

కామారెడ్డి క్రైం: టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి పైకి ఆర్టీసీ బస్సు రూపంలో మృత్యువు దూసుకువచ్చిన ఘటన జిల్లా కేంద్రంలోని స్టేషన్ రోడ్డులో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నారు. తాడ్వాయి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన పైడాకుల నారాయణ (55) కామారెడ్డి- సిరిసిల్లా రోడ్‌లోని ధర్మశాల పక్కన ఉండే ఫర్నీచర్ దుకాణంలో పనిచేస్తున్నాడు. రోజూ మాదిరిగానే టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై విధులకు వస్తుండగా వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. తలకు తీవ్ర గాయాలు కావడంతో నారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

రైలు కింద పడి ఒకరి మృతి



బోధన్: నిజామాబాద్–జానకంపేట రైల్వేస్టేషన్ల మార్గమధ్యలో సోమవారం గుర్తు తెలియని రైలు కిందపడి 60 నుంచి 65 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి మృతి చెందినట్లు నిజామాబాద్ రైల్వేస్టేషన్ మేనేజర్ చందన్ కుమార్ తెలిపారు. మృతుడు ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని రైల్వే అధికారులు అనుమానిస్తున్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదని రైల్వే ఎస్సై సాయరెడ్డి పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించినట్లు తెలిపారు. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే 87126 58591 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

బోటింగ్‌కు వెళ్లి సరస్సులో పడిపోయి..

- అమెరికాలో ఎత్తొండ క్యాంపు వాసి మృతి



హరికృష్ణ (ఫైల్)

రుద్రూర్: కోటగిరి మండలం ఎత్తొండ క్యాంపునకు చెందిన వడ్లమూడి హరికృష్ణ (49) అమెరికాలో ప్రమాదవశాత్తు సరస్సులో మునిగి మృతి చెందిన ఘటన మూడు రోజుల క్రితం (శనివారం) చోటు చేసుకుంది. సరదాగా బోటింగ్‌కు వెళ్లిన హరికృష్ణ సరస్సులో మునిగి మృతి చెందాడన్న సమాచారంతో ఎత్తొండ క్యాంపులో విషాదఛాయలు అలుముకున్నాయి. హరికృష్ణకు భార్య శిల్ప, కూతుళ్లు యుక్త, సరయు ఉన్నారు. 25ఏళ్ల క్రితం ఉద్యోగ రీత్యా అమెరికాలో స్థిరపడ్డారు. కుటుంబసభ్యులతో కలిసి ఏడాది, రెండేళ్లకోసారి ఎత్తొండ క్యాంపునకు వచ్చి స్నేహితులు, బంధువులతో గడిపి వెళ్లేవారు. ఆరు నెలల క్రితం హరికృష్ణ తల్లిదండ్రులు సరస్వతి, రాధాకృష్ణ అమెరికా వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. కాగా, హరికృష్ణ అంత్యక్రియలు అమెరికాలోనే నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత



వర్ని (మోస్రా): అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక టిప్పర్లను పట్టుకున్నట్లు వర్ని ఎస్సై మహేశ్ తెలిపారు. సోమవారం తెల్లవారుజామున రెండు టిప్పర్లలో ఇసుక తరలిస్తుండగా మోస్రా శివారులో పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు. ఈ టిప్పర్లు సాలూర శివారులోని మంజీర పరీవాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరికి రెండు రోజుల జైలు

వర్ని: మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ సోమవారం బోధన్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సాయి శివ తీర్పునిచ్చారు. ఈ నెల 20న బాన్సువాడ మండలం బోర్లం గ్రామానికి చెందిన ఓల్లెపు పాపయ్య మద్యం తాగి వాహనం నడుపుతుండగా వర్ని మండల కేంద్రంలో పట్టుకొని కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

కరెంట్ మీటరుపై పేరు మార్చాలా?

మీకు తెలుసా?



కరెంట్ బిల్లు

కమ్మర్‌పల్లి: విద్యుత్ మీటరుపై పేరు మార్పు కోసం వినియోగదారుల సౌకర్యార్థం విద్యుత్ సంస్థ వెబ్‌సైట్‌ను అందుబాటులో ఉంచింది.

- టీజీఎన్‌పీడీసీఎల్ వెబ్‌సైట్‌ను తెరిచి 'కన్స్యూమర్ సర్వీసెస్'పై క్లిక్ చేస్తే పలు సేవలు కన్పిస్తాయి. అందులో సర్వీస్ రిక్వెస్ట్ విండోపై క్లిక్ చేయాలి.
- కరెంట్ బిల్లుపై ఉండే యూనిక్ సర్వీస్ నెంబరు, మొబైల్ నెంబరు నమోదు చేస్తే ఓటీపీ వస్తుంది. ఓటీపీ నమోదు చేయగానే అక్కడ అందించే సర్వీసులు కన్పిస్తాయి.
- వాటిలో టైటిల్ ట్రాన్స్‌ఫర్, చిరునామా మార్పు, అదనపు లోడు, లైన్ల మార్పు, కేటగిరి మార్పు వంటివి ఉంటాయి.
- టైటిల్ ట్రాన్స్‌ఫర్‌పై క్లిక్ చేసి అవసరమైన మూడు డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలి.
- రిజిస్టర్డ్ సేల్ డీడ్/గిఫ్ట్ డీడ్, వ్యక్తిగత గుర్తింపు పత్రం(ఏదైనా ఐడీ), రూ.100 నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపరుతో కూడిన ఇండెమ్నిటీ బాండ్‌ను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి.
- బాండ్‌కు సంబంధించిన ఫార్మాట్ కూడా అక్కడే ఉంటుంది. దానిని డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు సమర్పించాలి.
- గుర్తింపు పత్రం జేపీజీ/పీఈజీ ఫార్మాట్‌లో ఉండాలి. వీటి సైజు 100కేబీ లోపు, ఇండెమ్నిటీ బాండ్ పీడీఎఫ్ రూపంలో 500 కేబీ లోపు, రిజిస్టర్డ్ డాక్యుమెంట్ పీడీఎఫ్ 5ఎంబీ లోపు సైజు ఉండే విధంగా జాగ్రత్త తీసుకోవాలి.
- అన్ని డాక్యుమెంట్లపై సంతకం తప్పనిసరి. ఆ తర్వాతే అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. సర్వీస్ చార్జ్ రూ.25 చెల్లించాల్సి ఉంటుంది.
- తర్వాత విద్యుత్ శాఖ వారు వివరాలన్నీ పరిశీలించి, అన్ని సరిగా ఉంటే మీ బిల్లుపై పేరును మార్పు చేస్తారు.

రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి

- ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి



పీహెచ్‌సీలో రోగుల రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో పార్థసింహారెడ్డి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులతో మర్యాదగా ప్రవర్తిస్తూ వారికి నాణ్యమైన వైద్యం అందజేయాలని ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి సూచించారు. నాగిరెడ్డిపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంతోపాటు కస్తూర్బా పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రోగుల రిజిస్టర్‌ను తనిఖీ చేసి ఆస్పత్రిలో నిల్వ ఉన్న మందులను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే రోగుల వివరాలతోపాటు ఇతర వివరాలను డాక్టర్ సృజన్‌ను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేసి పాఠశాలలో విద్యార్థులు, సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు. ఆయనవెంట నాగిరెడ్డిపేట తహసీల్దార్ శ్రీనివారావు, ఆర్ఐ మహ్మద్, కస్తూర్బా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ గీత తదితరులున్నారు.

యూఎస్‌పీసీ మహాధర్నాను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

కామారెడ్డి టౌన్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో ఆగష్టు 23న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి మహాధర్నాను విజయవంతం చేయాలని యూఎస్‌పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు చకినాల అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కర్షక్ బీఈడీ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీల షెడ్యూల్‌ను తక్షణమే విడుదల చేసి ఈ నెలాఖరులోగా ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. డీఈవో, డిప్యూటీ డీఈవో, ఎంఈవో పోస్టుల భర్తీ చేసి..ఉపాధ్యాయుల పెన్షనర్ల బిల్లులను విడుదల చేయాలన్నారు. 5,571 ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలని, జీవో 2.3, 9, 10లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్టీరింగ్ కమిటీ నాయకులు చింతల లింగం, ఆకుల బాబు, ప్రభాకర్, నళిని, శ్యాంకుమార్, నారాయణ, వంశీధర్, ప్రకాష్, లక్ష్మి, రాజ్‌కుమార్, రూప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పొరపాట్లను సరిదిద్దుకోవాలి



ప్రభుత్వ సిబ్బందిని ప్రశ్నిస్తున్న అధికారి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఉపాధిహామీ పనుల్లో జరుగుతున్న పొరపాట్లను సరిదిద్దుకోవాలని ఈజీఎస్ ఏపీడీ వామన్‌రావు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో ఆడిట్ బృందం ఉపాధి హామీ గ్రామసభ నిర్వహించగా పనులకు సంబంధించిన పూర్తి వివరాలు ఎందుకు ఆడిటర్లకు ఇవ్వలేదని పంచాయతీ కార్యదర్శులు, టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రశ్నించారు. అవగాహన లేకుండా చేస్తున్న పొరపాట్ల వల్ల కూలీలు నష్టపోతారని హెచ్చరించారు. ప్రతి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఉపాధి హామీ వివరాలు తెలిసేలా బోర్డులు, ఫ్లెక్సీలు అతికించాలని సూచించారు. ఎంపీడీవో సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసుల అందజేత



లింగంపేటలో ఎంఈవో షౌకత్ అలీకి సమ్మె నోటీసు ఇస్తున్న ఎండీఎం ఏజెన్సీ నిర్వాహకులు



నాగిరెడ్డిపేటలో..

లింగంపేట/నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తమ సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో ఆగస్టు 1 నుంచి 14 వరకు నిరాహార దీక్షలు చేపట్టడంతోపాటు ఆగస్టు 15 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నామని పేర్కొంటూ నాగిరెడ్డిపేట, లింగంపేట మండలాలకు చెందిన మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం స్థానిక ఎంఈవో కార్యాలయాల్లో సమ్మె నోటీసులను అందజేశారు. నాగిరెడ్డి పేట ఎంఈవో అందుబాటులో లేకపోవడంతో కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్ శైలేంద్రకు వారు సమ్మెనోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ రోజు మెనూ ప్రకారం కూరగాయలు, పప్పులు, రెండు రకాల కూరగాయలు చేయాలని అధికారులు ఇబ్బంది పెడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రకారంగా భోజనం పెడితే తాము నష్టపోతున్నామని పేర్కొన్నారు. ఒక్కో విద్యార్థికి రూ. 25 చొప్పున ఇస్తే రెండు రకాల కూరగాయలతో నాణ్యమైన భోజనం పెట్టగలమన్నారు.

విద్యార్థినికి రూ.15వేల ఆర్థికసాయం



విద్యార్థినికి చెక్కు అందిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

బాన్సువాడ: బాన్సువాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ఆలీషా మోహిన్‌కు సోమవారం ఉమ్మడి నిజామాబాద్‌కు చెందిన గుర్తి ఈశ్వర ట్రస్టు తరపున రూ.15వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ప్రతిభ కలిగిన పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలనే ఉద్దేశంతో ఉషాబాల, పవన్‌కుమార్ దంపతులు ట్రస్ట్ ద్వారా చేసిన సహాయాన్ని పాటుకూరి తిరుపతిరెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బంటు సాయిలుతో కలిసి విద్యార్థినికి అందించారు. మాజీ జెడ్పీటీసీ అంజిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, నాయకులు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నలుగురిపై హత్యాయత్నం కేసు నమోదు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలానికి చెందిన నలుగురు వ్యక్తులపై సోమవారం హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై భార్గవ్‌గౌడ్ తెలిపారు. చిన్నఆత్మకూర్ గ్రామానికి చెందిన పల్లె రవి అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన జాన్సన్, నవీన్ అనే వ్యక్తులను డబ్బులను అప్పుగా అడిగాడు. దీంతో జాన్సన్, నవీన్ ఈ నెల 23న అర్ధరాత్రి దాటాకా రవికి డబ్బులు ఇస్తామని చెప్పి అతడిని తీసుకొని తాండూర్‌కు వెళ్లారు. అక్కడ తాండూర్‌కు చెందిన చాకలి రాజు, నరహరి అనే మరో ఇద్దరిని తీసుకొని ఆత్మకూర్ గేట్ సమీపంలో మద్యం సేవించారు. అనంతరం నలుగురు కలిసి రవి తలపై సుత్తెతో దాడి చేశారు. తన భర్తపై దాడి చేశారంటూ రవి భార్య సంపూర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కాగా, పల్లె రవిని తాము చంపాలనే ఉద్దేశంతోనే దాడి చేశామని జాన్సన్, నవీన్, చాకలి రాజు, నరహరి విచారణలో పేర్కొనడంతో వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.